6 పేజీలు 7 నయా పైసలు ANDHRA JANATHA HYDERABAD REGD. NO. H. 634

200175

చలి తీవ్రరూపం దాల్చింది....
సరిక్రొత్త
*పుల్‌లెన్ స్వెట్టర్లు *బ్లాంకెట్లు *శాలువలు, *మఫ్లర్లు
మా వద్ద కొని చలిని ప్రతిఘటించండి
బుల్‌చంద్ అండ్ కో
"సిల్క్ పాలెస్", ఆబిడ్ రోడ్,
హైదరాబాద్. ఫోన్ నెం: 4233
(Khan & Sons)

ఆంధ్రజనత

హైద్రాబాద్, ఆదివారం 6-12-1959
సంపాదకుడు: కె. యస్. సుబ్రహ్మణ్యం
సంపుటి 5 సంచిక 162

బాంబే లాడ్జి
నూతనముగా తెరవబడినది
శాఖాహార భోజన, వసతి, ఫలహారశాల
(అశోక్ డ్రెసెస్ సమీపమున) సుల్తాన్ బజార్, హైద్రాబాద్.
ప్రసిద్ధమైన దక్షిణ భారత వంటకములు, ఆధునిక ఏర్పాట్లతో కూడిన వసతి సౌకర్యము, రుచికర భోజనము, వినయముతో కూడిన సేవ మీకెప్పుడూ లభించును. మరియు అన్ని బ్యాంక్‌లకు, పెద్ద పెద్ద వ్యాపార సంస్థలకు, వివిధ గవర్నమెంటు కార్యాలయాలకు అందుబాటులో గలదు.
[Siraj] స్త్రీలకు ప్రత్యేక ఏర్పాట్లు.

జనవరి మొదటి వారంలో నూత్న ప్రభుత్వ ప్రమాణ స్వీకారం

భారతీయ పత్రికల అతివాద వ్యతిరేకం

హైద్రాబాద్, డిసెంబర్ 5

భారత దేశంలో పత్రికలు అతివాద వ్యతిరేక ధోరణి నను సరిస్తున్నాయనీ, దీనిని కాంగ్రెస్ వ్యతిరేక ధోరణి అనడం తగదు యిష్టం లేదనీ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నికైన శ్రీ సంజీవరెడ్డి నేడిక్కడ పత్రికా విలేఖరుల గోష్ఠిలో అన్నారు.

"ప్రజల మనస్తత్వం నాకు తెలుసు. అతివాద వ్యతిరేక ధోరణి వారికి అంగీకారం కాదు" అని కూడా శ్రీసంజీవరెడ్డి అన్నారు.

మౌలానా అహ్మద్ సయీద్ అస్తమయం

న్యూఢిల్లీ, డిసెంబర్ 5

నిన్న రాత్రి స్వర్గస్తులైన జమియత్ ఉల్మా-ఎ-హింద్ అధ్యక్షుడు మౌలానా అహ్మద్ సయీద్ భౌతిక కాయానికి నేటి ఉదయం అంత్యక్రియలు జరిగాయి.

రెండు లక్షల మంది ప్రజలు అంత్యక్రియలకు హాజరైనారు.

పండిట్ పంత్, శ్రీమతి ఇందిరా గాంధీ, కాశ్మీర్ ప్రధాని బక్షీ గులాం మహమ్మద్, ముస్లిం దేశాల రాయబారులు కూడా అంత్యక్రియలకు హాజరైనారు.

తెలుగు రచయితల మహాసభలు

హైద్రాబాద్, డిసెంబర్ 5

దేశంలోని తెలుగు రచయితల మహాసభలు వచ్చే సంవత్సరం మార్చి నెలలో ఇక్కడ జరుగుతాయి. నవ్య సాహితీ సమితి ఈ సభలను ఏర్పాటు చేస్తున్నది.

తెలుగు రచయితల సమస్యలు, తెలుగు సాహిత్యాభివృద్ధి, తదితర విషయాలను సమావేశం చర్చిస్తుంది.

సమావేశం సందర్భంగా పుస్తకాలు, చిత్రాల ప్రదర్శనలు కూడా ఏర్పాటు చేస్తున్నారు.

ఆకాశవాణిలో శాసన సభల కార్యక్రమం

హైద్రాబాద్, డిసెంబర్ 5

శాసన సభలు జరుగుతున్న ప్రతి రోజూ ఆ రోజు కార్యక్రమాలను గురించి ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డి ఆకాశవాణి హైద్రాబాద్ నుండి ప్రసంగిస్తారు. ఈ ప్రసంగం సాయంత్రం 7-15 గంటలకు ప్రసారం చెయ్యబడుతుంది.

రః నెలాఖరు నాటికి కొత్త నాయకుని ఎన్నిక

శ్రీ సంజీవరెడ్డి ప్రకటన

("ఆంధ్ర జనత" విలేఖరి)

హైద్రాబాద్, డిసెంబర్ 5

ఆంధ్ర ప్రదేశ్ లెజిస్లేచర్ కాంగ్రెస్ పార్టీ నాయకుని ఎన్నిక డిసెంబర్ 29, 30 తేదీలలో జరుగుతుందనీ, నూతన ఆంధ్ర ప్రదేశ్ మంత్రివర్గం జనవరి మొదటి వారంలో ప్రమాణ స్వీకారం చేస్తుందనీ, ఈ విధంగా తన మంత్రివర్గ సభ్యుల జాబితాను సిద్ధపరుచడానికి నూతన నాయకునకు ఒక వారం రోజుల వ్యవధి వుంటుందనీ అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నికైన ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డి నేడు పత్రికా విలేఖరుల గోష్ఠిలో వెల్లడించారు.

కాంగ్రెస్ అధ్యక్షులుగా ఉన్నత స్థానానికి పోయినా, అది తమకేమంత ఆనందదాయకంగా లేదన్నారు. కాంగ్రెస్ అధ్యక్ష పదవి బాధ్యత తేలికైనది కాదు అంటూ 'మిత్రులందరి సహకారంతో, యీ నూతన హోదాలో దేశాన్ని సేవించడానికి నా శక్తి కొలది పని చేస్తాను' అన్నారు శ్రీ సంజీవరెడ్డి.

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం నుంచి తిరిగి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి పదవికి శ్రీ సంజీవరెడ్డి గారు రాజీనామా యిస్తారు. ముఖ్యమంత్రి పదవికి రాజీనామా యిస్తారేగాని, శాసనసభ సభ్యత్వానికి రాజీనామా యివ్వబోవటం లేదని శ్రీ సంజీవరెడ్డి స్పష్టంగా చెప్పారు.

ముఖ్యమంత్రి పదవికి వేర్వేరు పేర్లు వినవస్తున్నా, పార్టీ నాయకుని ఎన్నికకు పోటీ జరగదనీ, పార్టీ నాయకత్వమునాశిస్తున్న వారంతా కూడా ఎవరినో ఒకరిని నిర్ణయించాలని ఏకాభిప్రాయంతో ఉన్నారనీ, అందువల్ల పోటీ అంటూ ఉండదనీ శ్రీ సంజీవరెడ్డి అన్నారు.

"అదీగాక ఇక రెండు సంవత్సరాలలో జనరల్ ఎన్నికలు రానున్నాయి. కాంగ్రెస్ వాదులంతా ఒక్కటిగా కలసి పని చేసుకోవాలి. కాబట్టి తగాదాలు, విభేదాలతో కాలం గడుపుతూ కాంగ్రెస్ సంస్థనే కాంగ్రెస్‌వాదులు బలహీన పరచుకో రాదు. కాంగ్రెస్ సంస్థను బలపరచడంలో మిత్రులంతా నా వెనుక మద్దతుగా వుంటారనే నేను విశ్వసిస్తున్నాను" అని శ్రీ సంజీవరెడ్డి అన్నారు.

తాము అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నికైనట్లు ప్రకటింపబడిన 36 గంటలకు, తమకా విషయం తెలిసిందనీ, అది తన్ను అభినందించడానికి కర్నూలు రైల్వే స్టేషన్ వద్దకు వచ్చిన మిత్రుల ద్వారానే తమకా సంగతి తెలిసిందనీ అన్నారు. కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నిక ప్రకటన జరిగినపుడు తాము తమ స్వగ్రామంలో ఉన్నామనీ, ఆ గ్రామానికి పత్రికలు రావనీ, గ్రామంలో రేడియో కూడా లేదనీ శ్రీ సంజీవ రెడ్డి అన్నారు.

బెంగుళూరు కాంగ్రెస్ అధ్యక్షోపన్యాసం

బెంగుళూరు కాంగ్రెస్ మహాసభ అధ్యక్షోపన్యాసం సిద్ధపరచే విషయమై తీవ్రంగా ఆలోచిస్తున్నామన్నారు లోగడ ఎన్నడూ, ఏ కాంగ్రెస్ అధ్యక్షులు చెయ్యనటువంటి చిన్న ఉపన్యాసంగా తమ వుపన్యాసం వుంటుందనీ, అది చదవడానికి ఒక గంటకన్నా ఎక్కువ

(మిగతా 6వ పేజీలో)

అసెంబ్లీ పరిసర ప్రాంతంలో సభలు, సమావేశాల నిషేధం

హైద్రాబాద్, డిసెంబర్ 5

వచ్చే 7వ తేదీ నుంచి 12వ తేదీ వరకు రాష్ట్ర అసెంబ్లీ భవనానికి అర మైలు లోపల ఐదుగురు గాని, అంతకు మించి గాని వ్యక్తులు సమావేశం కారాదని ఇంట నగరాల పోలీస్ కమిషనర్ నేడు నిషేధాజ్ఞలను జారీ చేశారు.

పెండ్లి ఊరేగింపులు, మత సంబంధమైన ఊరేగింపులు కమిషనర్ అనుమతితో జరుపుకొన వచ్చు

ప్రధాని నెహ్రూ తొలి సారిగా టెలివిజన్ కార్యక్రమంలో పాల్గొన్న దృశ్యం. టెలిక్లబ్ సభ్యులను, బృందగానం చేస్తున్న బాలలను చిత్రంలో చూడ వచ్చు.

తృతీయ ప్రణాళికకు ఇతోధిక త్యాగాలు

అవసరమని ఆర్థిక మంత్రి వివరణ

కలకత్తా, డిసెంబర్ 5

గత కొలది సంవత్సరాల వెనుక కంటె దేశం ఆర్థిక స్థితి బలపడినప్పటికీ, తృతీయ ప్రణాళికను విజయవంతంగా నిర్వహించడానికి అన్ని రంగాలు ఇతోధిక త్యాగాలను చెయ్యవలసి ఉంటుందని ఆర్థిక మంత్రి శ్రీ మొరార్జీ నేడు అన్నారు. వాణిజ్య మండలుల సమాఖ్య వార్షిక సమావేశంలో ఆర్థిక మంత్రి నేడు ఉపన్యసించారు.

ప్రణాళిక ఇంకా పరిశీలనా దశలోనే ఉందనీ, మన వనరులను, అవసరాలనూ సమన్వయించి దీనిని రూపొందించాలని ఆయన అన్నారు.

కొన్ని విషయాలలో ఆర్థిక వ్యవస్థ బలపడినా, తృతీయ ప్రణాళికలో ఎదుర్కొన వలసిన ఇబ్బందులు కూడా కొన్ని ఉన్నాయని ఆయన అన్నారు. ట్రెల్లింగు నిల్వలు ఖర్చై పోవడం, విదేశాలకు తీర్చ వలసిన అప్పులు మనకు క్లిష్ట విషయాలని ఆయన అన్నారు. వ్యవసాయోత్పత్తులు పెరిగినా, అవసరానికి సరిపడినంతగా పెరగ లేదనీ, అనేక రంగాలలో అధికంగా పెట్టుబడి ధనం అవసరమనీ ఆయన అన్నారు.

మనం నిరాశా భావానికి లోనుకారాదనీ, మనకు ఎన్ని ప్రతిబంధకాలున్నా దేశం క్రమగతిలో పురోగమించి తీరవలసిందేననీ ఆయన అన్నారు.

పబ్లిక్, ప్రైవేట్ రంగాల నుంచి ఎక్కువగా పెట్టుబడులు రాగలవని తాను ఆశిస్తున్నాననీ, విదేశాల పెట్టుబడులు కూడా మన అభివృద్ధికి తోడ్పడగలవనీ ఆయన అన్నారు.

దేశంలో పరిస్థితి

వ్యవసాయ, పారిశ్రామిక రంగాల ఉత్పత్తులు చెప్పుకోదగిన అభివృద్ధిని సూచిస్తున్నాయనీ, గత సంవత్సరం వర్షాలు బాగున్నందున 730 లక్షల టన్నుల పంట పండిందనీ ఆయన అన్నారు. విదేశ మారక ద్రవ్య పరిస్థితి కూడా సంతృప్తికరంగా ఉందని ఆయన అన్నారు. ప్రస్తుత పద్ధతులలో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగితే భవిష్యత్తు ఆశాజనకంగా ఉండగలదని ఆయన అన్నారు.

పన్నుల విషయాన్ని ప్రస్తావించి, ఈ విషయంలో తాను ప్రస్తుతం ఏమీ చెప్పదలుచుకొనక పోయినా, తొలగించడానికి వీలైన ఇబ్బందులను తొలగించడానికి తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నానని ఆయన అన్నారు. సంఘం యొక్క కొనుగోలు శక్తిని వీలైనంత ఎక్కువ చెయ్యడమే మన ప్రధాన లక్ష్యమని కూడా ఆయన అన్నారు.

దేశపు ఆర్థిక సమస్యల పరిష్కారానికి ప్రణాళికా బద్ధమైన కృషి అవసరమనీ, అప్పుడే వివిధ సమస్యలను సమన్వయించడం సాధ్యం కాగలదనీ ఆయన అన్నారు. మన ప్రణాళికల పట్ల సుప్రభావం సర్వత్రా గోచరిస్తున్నదనీ, మన లక్ష్యాలను చేరడానికి ఉత్తమ మార్గాలను అనుసరించడం మన విధానమనీ ఆయన అన్నారు.

దేశంలోని అన్ని వర్గాల వారు సంపూర్ణంగా సహకరిస్తే మన లక్ష్యాలను చేరడం సుసాధ్యమని కూడా ఆయన అన్నారు.

ప్రముఖ క్రికెట్ ఆటగాడు దులీప్ సింహాజీ మృతి

బొంబాయి, డిసెంబర్ 5

ప్రపంచంలో కెల్లా పేరు మోసిన క్రికెట్ ఆటగాళ్ళలో ఒకరైన మహారాజా కె ఎస్. దులీప్ సింహాజీ నిన్న రాత్రి నిద్రలో గుండెపోటు వల్ల మరణించారు.

ఆయన వయస్సు 54 సంవత్సరాలు నేటి సాయంత్రం ఆయన భౌతిక కాయానికి అంత్యక్రియలు జరిగాయి.

పట్టపగలు బ్యాంకు దోపిడీ

జాంషెడ్పూర్, డిసెంబర్ 5

జాంషెడ్పూర్‌లోని సివిల్ లైన్సు ప్రాంతంలో ఉన్న అలహాబాద్ బ్యాంకు శాఖలో మధ్యాహ్నం 2-30 గంటలకు దొంగలు ప్రవేశించి 25 వేల రూపాయలను దోచుకున్నారు. మధ్యాహ్నం రెండున్నరకు దొంగలు ఒక కారులో వచ్చి తుపాకులను చూపి కాపలా వారిని బెదిరించి ఖజానాలోని 25 వేల రూపాయలను తీసుకున్నారు. ఆ బ్యాంకులో దొంగలు సుమారు అరగంట ఉన్నారట. ఈ సందర్భంలో బ్యాంకు ఏజంటు శ్రీ కె. యస్. మెహ్రో, పరాబు లాలా భగవత్ ప్రసాద్ మొదలైన 6 మంది బ్యాంకు సిబ్బందికి తుపాకి గుండు దెబ్బలు తగిలాయి. వీరు ప్రభుత్వపు టాక్సీని ఒక దానిని అద్దెకుతీసుకొని దానిపై బ్యాంకుకు వచ్చారనీ, వీరందరూ ఆధునికమైన దుస్తులు ధరించి ఉన్నారనీ తెలుస్తున్నది.

దేశంలో పత్తి ధరల పెరుగుదల నివారణకు చర్యలు

బొంబాయి, డిసెంబర్ 5

దేశంలో ఇటీవల విపరీతంగా పెరిగిపోయిన పత్తి ధరలను అదుపులో పెట్టటానికిగాను కేంద్ర ప్రభుత్వం చర్యలను గైకొంటున్నట్లు నేడు ప్రకటించినది.

టెక్స్‌టైల్ కమిషనర్ నేడు జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం మిల్లులు వాటికి మూడు నెలల వరకు అవసరమైన సరకు కంటె ఎక్కువ నిల్వ చేయటం గాని, కొనుగోలు చేయటం గాని నిషేధించారు.

సింహళ పార్లమెంట్ రద్దు: గవర్నర్ జనరల్ ఉత్తర్వు

వచ్చే మార్చి నెలలో ఎన్నికలు

కొలంబో, డిసెంబర్ 5

సింహళ పార్లమెంట్‌ను రద్దు చేస్తూ, గవర్నర్ జనరల్ సర్ ఆలివర్ గుణతిలకే నేడొక ఉత్తర్వును జారీ చేశారు. ప్రధాని దహనాయకే సలహాను పురస్కరించుకొని ఈ నిర్ణయం చేసినట్లు ఆయన ప్రకటించారు. 1960 మార్చి 19 వ తేదీని నూతన ఎన్నికలు జరగాలని కూడా ఆయన ఉత్తర్వు చేశారు. 1960 మార్చి 30 వ తేదీన నూతన పార్లమెంట్ సమావేశం కాగలదని కూడా ఆయన ప్రకటించారు.

పార్లమెంట్ ఇంత హఠాత్తుగా రద్దు కావటం మంత్రులను, పార్లమెంట్ సభ్యులను కూడా చకితులను చేసినది

వచ్చే సంవత్సరం మార్చి నెలలో కొత్త ఎన్నికలు జరుగుతాయి.

ప్రభుత్వ పక్షానికి మెజారిటీ ఐదు నుంచి ఒకటికి తగ్గిన తర్వాత పార్లమెంట్ రద్దు కావచ్చునని లోగడ కొందరు ఊహించారు. అయితే పార్లమెంట్ మరికొంత కాలం కొనసాగవచ్చునని ఇటీవల ప్రధాన మంత్రి సూచనగా అనటం వల్ల, జనవరి 19 వరకు సమావేశాలు కొనసాగాలని ఇటీవల ప్రభుత్వం విజ్ఞప్తి చేయటం వల్ల ఇప్పట్లో పార్లమెంట్ రద్దు కాదని అంతా భావించారు.

పార్లమెంట్‌ను రద్దు చేయ వలసిందిగా ప్రధాన మంత్రి దహనాయకే గవర్నర్ జనరల్ శ్రీ గుణతిలకేకు సిఫార్సు చేసే ముందు మంత్రివర్గంలో సంప్రతించ లేదని మంత్రివర్గ ప్రతినిధి ఒకరు అన్నారు.

అతి క్లిష్టమైన నిర్ణయాన్ని గైకొనే ముందు ప్రధాన మంత్రి తన మంత్రి వర్గాన్ని, పార్టీని సంప్రతించక పోవటం ఆశ్చర్యకరంగా ఉన్నదని ప్రభుత్వ పక్ష ప్రతినిధి ఒకరు అన్నారు.

నేటి ఉదయం పత్రికలలో వచ్చాక

(మిగతా 6 వ పేజీలో)

గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణ కాలం తగ్గింపు

న్యూఢిల్లీ, డిసెంబర్ 4

మద్రాసు నుంచి ఢిల్లీ పోయే గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణ కాలం వచ్చే ఏప్రియల్ నుంచి మరో గంట తగ్గించబడుతుందని రైల్వే మంత్రి శ్రీ జగ్జీవన్‌రామ్ దక్షిణ రైల్వే, పార్లమెంటు సలహా సంఘంలో అన్నారు. భీమవరం-గుడివాడ, మచిలీపట్నం-విజయవాడల మధ్య మీటరుగేజి మార్గాన్ని బ్రాడ్‌గేజిగా మార్చే కార్యక్రమం ద్వితీయ ప్రణాళికలో చేర్చబడిందని కూడా ఆయన అన్నారు.

తృతీయ ప్రణాళికలో సమాజాభివృద్ధి

వ్యవసాయానికి ప్రాముఖ్యం ఇవ్వనున్నట్టు శ్రీ శ్రీమాన్ నారాయణ ప్రకటన

హైద్రాబాద్, డిసెంబర్ 5

మూడవ పంచవర్ష ప్రణాళికలో సమాజాభివృద్ధి కార్యక్రమాలలో కొనసాగుతూ బ్లాక్ ప్రాంతాలలో అధిక వ్యవసాయోత్పత్తికి ప్రాధాన్యం ఇవ్వబడుతుందని ప్లానింగ్ కమిషన్ సభ్యుడు శ్రీ శ్రీమాన్ నారాయణ నేడు ఇక్కడ అన్నారు.

ఇక్కడకు 10 మైళ్ళ దూరంలోని హిమాయత్‌సాగర్‌లో ఓరియంటేషన్ ట్రెయినింగ్ సెంటర్ ఉద్యోగ తరగతులను ప్రారంభించిన సందర్భంలో ఆయన పై విధంగా అన్నారు.

గ్రామ సేవకులు ఎక్కువ కాలాన్ని శక్తిని వ్యవసాయాభివృద్ధికి వినియోగించేటట్టు సమాజాభివృద్ధి కార్యక్రమాలను రూపొందించ వలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాలను తదివరకే ఆదేశించటం జరిగినట్టు ఆయన వెల్లడించారు.

వ్యవసాయాభివృద్ధికి శీఘ్ర గతి జరిగేటట్టు రాష్ట్రంలో కనీసం ఒక పైలట్ ప్రాజెక్టు ఏనా ఏర్పడాలని ప్లానింగ్ కమిషన్ సూచించినట్టు ఆయన తెలియ జేశారు. ప్రతి పైలట్ ప్రాజెక్టు ఒక్కొక జిల్లాలో వ్యవసాయాభివృద్ధికి బాధ్యతను స్వీకరించాలని కూడా ప్లానింగ్ కమిషన్ సూచించినది రెండవ ప్రణాళికాకాలం ముగిసేలోగా దేశంలో 14 జిల్లాలకు వర్తించే పైలట్ ప్రాజెక్టులను స్థాపిస్తారు. పైలట్ ప్రాజెక్టుల ద్వారా పొందే అనుభవాన్ని తృతీయ ప్రణాళికలో సమాజాభివృద్ధి కార్యక్రమాలను అమలు జరపటంలో ఉపయోగించుకుంటారు అని శ్రీ శ్రీమాన్ నారాయణ అన్నారు.

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

సికింద్రాబాద్, డిసెంబర్ 5

అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నికైన ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డిగారికి నేడు ఉదయం సికింద్రాబాద్ స్టేషన్‌లో వేలాది కాంగ్రెస్ వాదులు, స్త్రీలు, పిల్లలు ఘన స్వాగతం ఇచ్చారు. శ్రీ రెడ్డి కర్నూలు నుంచి రైలులో నేడిక్కడికి వచ్చారు. కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఏకగ్రీవంగా శ్రీ రెడ్డి ఎన్నికైనట్లు 31 వ తేదీన ప్రకటింపబడిన తరువాత రాజధానికి వస్తున్న ముఖ్యమంత్రికి స్వాగతం ఏర్పాటు చేయబడింది.

కాంగ్రెస్ సేవాదళం ప్రదేశ్ అగ్రనైజర్ శ్రీ ఎమ్. సత్యనారాయణ పర్యవేక్షణ క్రింద కాంగ్రెస్ సేవాదళం ఈ సందర్భంలో విస్తృతమైన ఏర్పాట్లను చేసింది. మాజీ కాంగ్రెస్ అధ్యక్షునికి స్వాగతం ఇవ్వడానికి వచ్చిన వందలాది కాంగ్రెస్‌వాదులు ప్లాట్ ఫారంపై వగలిన ఎర్ర తివాచీపై కూర్చుని శ్రీ రెడ్డి రాకకు నిరీక్షించారు.

శ్రీ సంజీవరెడ్డి, ఆయన సతీమణి శ్రీమతి నాగరత్నమ్మతో తెల్లవారుఝామున ఎక్స్‌ప్రెస్ నుంచి దిగగానే ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ పిడతల రంగారెడ్డి ఆయనను పూలమాలాలంకృతులను చేశారు. ప్రదేశ్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వి. వి. రావు, హైద్రాబాద్ మేయరు శ్రీ రోశయ్య, భాన్, సికింద్రాబాద్ మేయరు సిన్నం సత్యనారాయణ గుప్త, హైద్రాబాద్ నగర కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ యస్. పి. ఫైజ్వాల్, సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ అన్నపరెడ్డి విశ్వనాథరావు, హైద్రాబాద్ జిల్లా పరిషత్తు అధ్యక్షుడు శ్రీ యమ్ ఎస్ లక్ష్మీనరసయ్యలు కూడా ముఖ్యమంత్రికి పూలమాలలు వేశారు.

శ్రీ రెడ్డి అచ్చటి నుంచి ప్రధాన ప్లాట్ ఫారం మీదకు రాగానే నగరంలోనూ, జిల్లాలోనూ ఉన్న అనేక సంస్థల తరపున ఆయనకు పూలమాలలు వేయబడ్డాయి మంత్రివర్గ సభ్యులు శ్రీ జె. వి. రంగారెడ్డి, శ్రీ కె. ప్రభోధానందరెడ్డి, శ్రీ యస్ పి. పట్టాభిరామారావు, శ్రీ సంజీవయ్య, శ్రీ జె. వి. నరసింగరావు, కరీంనగర్ జిల్లా పరిషత్తు అధ్యక్షుడు శ్రీ చొక్కారావు, జాతీయ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ శ్రీ నాయకుడు శ్రీ జి. సంజీవరెడ్డి, హైద్రాబాద్, సికింద్రాబాద్ పురపాలక సంఘాల సభ్యులు, శాసనసభ, మండలి సభ్యులు, ప్రదేశ్ కాంగ్రెస్ మహిళా, యువజన విభాగాల సభ్యులు, వివిధ విద్యాలయాల నుంచి వచ్చిన వందలాది బాల బాలికలు కూడా ఆయనకు పూలమాలలు వేశారు.

ఒక చిన్నారి పాప తనకు దండ వేసినప్పుడు శ్రీ సంజీవరెడ్డి సంతోషంతో ఆ పాపకు తిరిగి మరో దండను వేశారు. తనకు దండలను వెయ్యడానికి వచ్చిన అనేక మంది బాలబాలికలకు ఆయన తనవద్ద దండలను వేశారు ముఖ్యమంత్రి చూపిన ఈ ఆప్యాయత అచ్చట చేరిన బాల బాలికలకు ఎంతో సంతోషాన్ని కలిగించింది.

శ్రీ సంజీవరెడ్డి ప్లాట్ ఫారం నుంచి బయలు దేరగానే కాంగ్రెస్ సేవాదళ బృందాల వారు ఆయనకు పూలమాలలను సమర్పించారు. సేవాదళం వారు ప్రదర్శించిన క్రమశిక్షణను ప్రేక్షకులే కాక, ముఖ్యమంత్రి కూడా శ్లాఘించారు.

స్టేషన్ నుంచి బయలు దేరి వెళ్ళే ముందు శ్రీ రెడ్డి సేవాదళం వారి గౌరవ వందనాన్ని స్వీకరించారు. లాంఛనప్రాయంగా పరిచయాలు అయిన పిదప ఆయన కారులో ఇంటికి వెళ్ళారు.

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ చరి

(మిగతా 6వ పేజీలో)

రెండవ ప్రణాళికలోనే పోచంపాడు ప్రాజెక్టు

ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డి ఆశాభావం

("ఆంధ్ర జనత" విలేఖరి)

హైద్రాబాద్, డిసెంబర్ 5

బొంబాయి ప్రభుత్వం ప్రాథమిక అభ్యంతరం లేవతీసినప్పటికిన్నీ, రెండవ పంచవర్ష ప్రణాళిక ఆఖరు సంవత్సరం కార్యక్రమంలో పోచంపాడు ప్రాజెక్టు చేరి తీరుతుందనే దృఢ విశ్వాసాన్ని ఆంధ్ర ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డి నేడు ప్రకటించారు.

ఈ విషయమై బొంబాయి ముఖ్యమంత్రితో యిదివరకే ఒకసారి తాము సంప్రదించినట్లు పత్రికా గోష్ఠిలో శ్రీ సంజీవరెడ్డి వెల్లడించారు.

పోచంపాడు ప్రాజెక్టు నిర్మాణంవల్ల బొంబాయి రాష్ట్రానికి ప్రయోజనాలు యే విధంగాను దెబ్బతినవనీ, బొంబాయి వారికి నమ్మకం కుదర్చ బోతున్నామనీ, గోదావరి దిగువన పోచంపాడు ప్రాజెక్టు నిర్మాణం జరుగుతున్నందున బొంబాయి ప్రయోజనాలు ఏ మాత్రం దెబ్బ తినవని వారికి నచ్చచెప్పడం కష్టసాధ్యంకాదని కూడా శ్రీ సంజీవరెడ్డి అన్నారు.

క్రిస్మస్ పండుగకు సరిక్రొత్త రేయన్ పట్టింగులు, బుష్ పట్టింగులు
విజై సేల్స్ ఎంపోరియం
కపూర్‌చంద్ బిల్డింగ్ మొదటి అంతస్తు, క్లాక్‌టవర్ ఎదుట,
సుల్తాన్ బజార్, హైదరాబాద్.

పూర్ణచంద్రోదయమాత్రలు
శుక్లనష్టమును పోగొట్టి
నరములకు బలమునిచ్చును
వేంకటేశ్వర ఆయుర్వేదనిలయము
చింతలూరు, ఆలమూరుపోష్టు, పూర్వగోదావరిజిల్లా.
ఆంధ్రదేశమందు ముఖ్యపట్టణములలో అన్ని మందుల దుకాణములలోను దొరుకును.
హైదరాబాద్ బ్రాంచ్: 712, సెంట్రల్ బ్యాంక్ బిల్డింగ్స్.
సికిందరాబాద్ బ్రాంచ్: 7-2-148, హిస్సామ్‌గంజ్ రోడ్,
పాత పోలీస్ స్టేషన్ ఎదుట.

వికారినామ సంవత్సరం

ఆదివారం, డిసెంబర్ 6, 1959

మార్గశిర శుద్ధ సప్తమి

సప్తమి రా॥ 1-10

ధనిష్ఠ ఉ॥ 11-36

వర్జ్యం సా॥ 6-48 మొ॥ 8-18

ఆంధ్రజనత

టెలిఫోన్ నెంబరు : 4950

ఆదివారం, డిసెంబర్ 6, 1959

హర్షదాయకం

భాషా ప్రయుక్తంగా బొంబాయి రాష్ట్రాన్ని విభజించటానికి కాంగ్రెస్ కార్యవర్గం నిర్ణయించటం అత్యంత హర్షదాయకం.

బొంబాయిని ద్విభాషా రాష్ట్రంగా ఏర్పాటు చెయ్యటానికి కారణభూతమైన పరిస్థితులు ఏమైనప్పటికీ, భాషా ప్రయుక్త రాష్ట్ర నిర్మాణ సూత్రాన్ని ఆ ప్రాంతానికి వర్తింపజేయక పోవటం పెద్ద పొరపాటని ఆ తర్వాత జరిగిన సంఘటనలు స్పష్టంగా రుజువు చేసినవి. కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఎన్నికైన శ్రీ సంజీవ రెడ్డి పేర్కొన్నట్టు, ఇటువంటి విషయంలో ప్రజల వాంఛలను, అభిప్రాయాలను పాటించటం అత్యవసరం. అప్పట్లో ఈ సూత్రాన్ని విస్మరించటం వల్ల మహారాష్ట్ర, గుజరాత్ ప్రాంతాల్లో కాంగ్రెస్ పరిస్థితి ఏటికి ఎదురీదటంగా పరిణమించింది అయితే, ఈ విషయంలో కాంగ్రెస్ అధిష్ఠాన వర్గం యొక్క చిత్తశుద్ధిని ఎవరూ శంకించలేదు, శంకించటానికి వీలులేదు. ద్విభాషా బొంబాయి రాష్ట్రం విజయవంతం కాలేదని ఎప్పుడైతే స్పష్టమైనదో, అధిష్ఠాన వర్గం ప్రజాభిప్రాయానికి అనుగుణంగా బొంబాయిని భాషా ప్రాతిపదికపై విభజించటానికి వెంటనే చర్యలు తీసుకొన్నది. దీని వల్ల మహారాష్ట్ర, గుజరాత్ ప్రాంతాలలో కాంగ్రెస్ పలుకుబడి పెరగ గలదని నిస్సంశయంగా చెప్ప వచ్చు. కాంగ్రెస్ ఈ విషయంలో చొరవ చేసి సాహసోపేతమైన నిర్ణయం గైకొన్న ఫలితంగా అప్పుడే సంయుక్త మహారాష్ట్ర సమితి, గుజరాత్ సంయుక్త పరిషత్తు విచ్ఛిన్న మయ్యే సూచనలు కానవస్తున్నవి.

విదర్భను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను కాంగ్రెస్ కార్యవర్గం త్రోసి పుచ్చటం కూడా ఎంతైనా అభినందనీయం. ఈ ప్రతిపాదన ఎంత మాత్రం సమర్థనీయం కాక పోగా, చాలా అనర్థదాయకమైనదనటంలో సందేహం లేదు. సాధ్యమైనంత వరకు పెద్ద రాష్ట్రాలను ఏర్పాటు చెయ్యాలన్న సూత్రాన్ని కాంగ్రెస్ పెద్దలు ఏనాడో అంగీకరించారు. ఈ సూత్రానికి ఎదురు తిరిగే వారు విచ్ఛిన్నకర శక్తులే. వీటిని తలెత్తకుండా చెయ్యటం అవసరం.

ఆస్తి అప్పుల పంపకం విషయంలో కొన్ని అభిప్రాయ భేదాలు ఉన్నట్టు కానవస్తున్నది. మహారాష్ట్ర మిగులు 12 కోట్ల వరకు ఉంటుందని, ఈ మొత్తంలో 5 కోట్ల రూపాయలు 10 సంవత్సరాల వరకు గుజరాత్‌కు ఇవ్వాలని ఒక ప్రతి పాదన ఉన్నది. ఈ విషయంలో కాంగ్రెస్ నాయకులు వోక్యం కలిగించుకొనటం సుచితం కాదు. ఈ సమస్యను పరిష్కరించటానికి ఫైనాన్స్ కమిషన్‌ను నియమించటం సర్వోత్తమం. ఈ విధంగానే సరిహద్దుల నిర్ణయానికి కూడా న్యాయమూర్తిని నియమించటం శ్రేయస్కరం. ఈ పద్ధతిని అనుసరిస్తే ఎవరికీ అసంతృప్తి ఉండదు. అయితే, ఉభయ పక్షాలు సామరస్య పూర్వకమైన వైఖరిని అవలంభించ వలసి ఉన్నది.

ఆల్జీరియా సమస్య పరిష్కార మార్గం

ఫ్రెంచి స్వతంత్ర సోషలిస్టు పార్టీ నాయకుని సూచన

బొంబాయి, డిసెంబర్ 3

స్వేచ్ఛా వాతావరణంలో, ప్రజాస్వామికంగా తమ దేశ భవితవ్యాన్ని తామే నిర్ణయించుకొనే అవకాశం ఆల్జీరియాకు కల్గించడం వినా ఆల్జీరియా సమస్య పరిష్కారానికి వేరే మార్గము లేదని స్వతంత్ర ఫ్రెంచి సోషలిస్టు పార్టీ నాయకుడు ప్రొఫెసర్ ఆంద్రీ ఫిలిప్ నేడిక్కడ అన్నారు.

ప్రజా సోషలిస్టు పార్టీ అధ్వర్యాన జరిగిన సభలో ప్రసంగిస్తూ, యూరప్ దేశాల యుద్ధానంతర సమస్యల పరిష్కారానికి యూరప్ దేశాల సమైక్యత, ఆదేశాల మధ్య పరస్పర ఆర్థిక సహకారము అవసరమని వారన్నారు

జాతి పెరుగుదలను నివారించడము, జాతీయాదాయాన్ని పెంపొందించుకొనడం అనే రెండు ప్రధాన సమస్యలు నేడు ఫ్రాన్స్‌ను ఎదుర్కొన్నాయన్నారు.

ఆల్జీరియాలో డిగాల్ ప్రభుత్వం సాగిస్తున్న దమన నీతి పట్ల ఫ్రెంచి సోషలిస్టులు పెదవి కదపడం లేదనీ, తమ పార్టీ మాత్రం యీ దమన కాండను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదని శ్రీ ఫిలిప్ అన్నారు.

పరిపాలనా వ్యవస్థ సంస్కరణకు కమిటీ నియామకం

లోక్ సభలో అనధికార తీర్మానం త్రోసివేత

న్యూఢిల్లీ, డిసెంబర్ 4

దేశంలో పరిపాలనా వ్యవస్థను పునర్వ్యవస్థీకరించటానికి గాను ఒక ఉన్నతాధికార కమిషన్‌ను నియమించాలని సూచిస్తూ ప్రవేశ పెట్టబడిన ఒక అనధికార తీర్మానాన్ని లోక్ సభ నేడు త్రోసివేసినది.

పంజాబ్ కాంగ్రెస్ సభ్యుడు ప్రొఫెసర్ డి. సి. శర్మ ప్రతిపాదించిన ఈ తీర్మానాన్ని పెక్కు మంది సభ్యులు సమర్థించారు.

పరిపాలనా వ్యవస్థను కట్టుదిట్టం చేయటం, వికేంద్రీకరణ చట్టం, అవినీతిని పూర్తిగా నిర్మూలించి పరిపాలనా సామర్థ్యాన్ని పెంచటం అవసరమని వారంతా ఏకగ్రీవంగా ప్రకటించారు.

ఇద్దరు కాంగ్రెస్ సభ్యులు శ్రీయుతులు ఎ. సి. గుహా, సురేంద్రనాథ్ మహంతి కమిషన్ నియామకం వల్ల సమస్య పరిష్కారం అవుతుందా అనే సందేహాన్ని ప్రకటించారు.

పరిశీలనలో ప్రభుత్వం ఇప్పటికే అనేక సంస్కరణలను తీసుకొని వచ్చినదనీ, ఇంకా చేయనున్నది గనుక అలాటి కమిషన్‌ను ఏర్పాటు చేయవలసిన అవసరం ఉన్నట్టు ప్రభుత్వం భావించటం లేదని దేశ వ్యవహారాల శాఖ లోని మంత్రి వి. ఎన్. దాతార్ అన్నారు.

ఆదాయపు పన్ను చట్ట సవరణ

న్యూఢిల్లీ, డిసెంబర్ 4

ఆదాయపు పన్ను చట్టాన్ని సవరించడానికి అవసరమైన చర్యలు త్వరలో తీసుకొనబడగలవని ఆర్థిక మంత్రి మొరార్జీ దేశాయ్ నేడు లోక్ సభలో వెల్లడించారు ఆదాయపు పన్నును ఎగ్గొట్టిన వారి పేర్లను గెజిటులో ప్రకటించడం ప్రస్తుత చట్టాన్ని సవరించిందాకా వీలు పడదని కూడా ఆయన అన్నారు. శ్రీ త్యాగి సంఘం సమర్పించిన నివేదిక పై నిర్ణయాలు చెయ్యడానికి కొంత వ్యవధి కావాలని కూడా ఆయన అన్నారు.

బొంబాయి, డిసెంబర్ 3

ద్వితీయ ప్రణాళికలో పోర్బందర్, జామ్‌నగర్ లలో రెండు కేంద్ర సాంకేతిక విద్యాలయాలను స్థాపించాలని అఖిల భారత సాంకేతిక విద్యా సంస్థ నేడు సిఫారసు చేసింది.

ధీనిని-ప్రతిధ్వనిని

స్వీయ సంవత్సరం

కాంగ్రెస్ అధ్యక్షుడుగా శ్రీ సంజీవ రెడ్డి గారు ఎన్నికోబడటం నిజంగా మంచి నాకు అభినందనీయం. ముఖ్యంగా ఆంధ్రులకు గర్వకారణం.

దేశంలో చిల్లా మహోన్నతమైనదిగా పరిగణిస్తూ వచ్చిన కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఎన్నికైన ఆంధ్రులలో శ్రీ సంజీవ రెడ్డి మూడవ వారు. స్వాతంత్ర్య సముపార్జనానికి పూర్వం దేశభక్త (స్వర్గీయ) శ్రీ కొండా వెంకటప్పయ్య పంతులుగారు కొంత కాలం కాంగ్రెస్ అధ్యక్షులుగా వ్యవహరించారు. స్వాతంత్ర్య సముపార్జనానంతరం శ్రీ పురుషోత్తమ దాస్ టాండన్‌తో జరిగిన పోటీలో గెలుపొంది డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య గారు కాంగ్రెస్ అధ్యక్ష పీఠాన్ని అలంకరించారు.

* * *

గొప్పతనం మూడు రకాలన్నాడు మహాకవి షేక్సిపియర్. కొందరికి పుట్టుకతోనే గొప్పతనం వస్తుంది. కొందరు గొప్పతనాన్ని సాధిస్తారు. కొందరికి వద్దంటున్నా గొప్పతనం వచ్చి పడుతుంది. శ్రీ సంజీవ రెడ్డిగారికి వీటిలో ఏది వర్తించదు. షేక్సిపియర్ విశ్వ విఖ్యాతి గాంచిన రచయితే అయినా, గొప్పతనం గురించి అతడు చెప్పింది సమగ్రం కాదు. కొందరిని గొప్పతనం వరిస్తుందన్న విషయం అతనికి తట్టలేదు. గొప్పతనం ఫలానా వారిని వరించిందనటానికీ, బలవంతంగా వచ్చి పడిందనటానికీ తేడా ఉన్నది. రాజుగారి కూతురు రాజవంశేతరుణ్ణి వరించిందంటే, అతనిలో ఒక ప్రత్యేక ఆకర్షణ, ప్రతిభా విశేషాలు ఉండితీరాలి. స్వయంవరం జరిగిన తర్వాత రాజాజ్ఞను శిరసావహించి, రాకుమారిని వివాహం చేసుకు తీరవలసిందే. ఇంతకీ చెప్పవచ్చిందేమిటంటే, స్వతహాగా వ్యక్తిలో ఉత్తమ లక్షణాలు ఉంటేనే కాని, గొప్పతనం అతనిని వరించటం అన్నది జరగదు.

* * *

ఢిల్లీలోని కాంగ్రెస్ కన్యాధాతల దృష్టి శ్రీ సంజీవ రెడ్డిగారిపై పడటానికి కారణం ఏమిటి? అధిష్ఠాన వర్గానికి అర్భకులు, అసమర్థులు అంటే అసహ్యం, స్థిరచిత్తులు, ధీరోదాత్తులు, కార్యశూరులు, పరిపాలనాదక్షులు, నిజాయితీపరులు-ఇటువంటి విశిష్ట వ్యక్తులకోసం వారు అన్వేషణ సాగిస్తున్నారు. శ్రీ సంజీవ రెడ్డి గారిలో వారికి ఇట్టి ఉత్కృష్ట లక్షణాలు కనిపించాయి.

* * *

విజయానికి సాటి విజయమే అన్నారు పెద్దలు. శ్రీ సంజీవ రెడ్డి యావద్భారత దృష్టిని ఆకర్షించటానికి ప్రధాన కారణం ఇదే. ముఖ్యమంత్రి పదవికి శ్రీ సంజీవ రెడ్డి గారి పేరు సమర్థింపబడ్డం, విజయవంతంగాను, మరోవైపు నిర్వహించలేదం... అతిశయోక్తి కాజాలదు. ప్రభుత్వ యంత్రాంగాన్ని, పార్టీ యంత్రాంగాన్ని రూడా ఆయన చాలా పటిష్ఠంగాను, కట్టుదిట్టంగాను నడిపించారు. అన్ని రంగాలలోను సత్ఫలితాలను సాధించారు. అన్నిటి కన్న గొప్ప విశేషం ఏమిటంటే ఈ విజయాలన్నిటినీ ఢిల్లీ ఆసరా లేకుండా సాధించారు. ఢిల్లీ జోక్యానికి ఆయన ఎన్నడూ ఏ విషయంలోను ఆస్కారం మివ్వలేదు. ఇది మొత్తం దేశంలోనే అపూర్వ విజయం. మతోన్మిత్తం లేకుండా (అప్పుడప్పుడు తమరిని ధిక్కరించి కూడా) విజయాన్ని సాధించే వారంటే, అధిష్ఠాన వర్గం వారికి ఆప్యాయం మెండు. ఈ కిటుకు చాలా మందికి తెలియదు.

* * *

రాష్ట్ర వ్యవహారాలలో శ్రీ సంజీవ రెడ్డి ఇట్టి ఘన విజయాన్ని సాధించటానికి చాలా కారణాలున్నవి. ఆయన "ప్రకాశం తర్వాత ప్రకాశం అంతటి వాడు" అన్నారు కొందరు. ఇదిచాలావరకుఅక్షరాలా నిజం ప్రకాశం తర్వాత ఆంధ్రదేశం మూర్తీభవించిన వ్యక్తి శ్రీ సంజీవ రెడ్డే. ధిక్కారస్వభావం ఆంధ్రుల ముఖ్య లక్షణం. న్యాయం కోసం పోరాడటం లోను, అన్యాయాన్ని ప్రతిఘటించటం లోను ఈ ధిక్కార స్వభావం - దీనిని పౌరుషం అనటం సబబు - ఎక్కువగా వ్యక్తమౌతుంటుంది. ప్రకాశంగారు దీనికి పెట్టింది పేరు. ఈ గుణాన్ని శ్రీ సంజీవ రెడ్డి కూడా అలవరచుకున్నారు. ఇంతేగాక, ప్రకాశంగారి వలె శ్రీ సంజీవ రెడ్డి ముక్కుకు సూటిగా నడుచుకొనే వ్యక్తి. చెప్పదలచుకొన్నదేదో నిర్భయంగా, నిర్మొహమాటంగా, కచ్చితంగా, కుండ బద్దలు కొట్టినట్టు చెప్పగలగటం నిష్కళంకమైన శీలం గలవారికే కాని ఇతరులకు సాధ్యం కాదు శ్రీ సంజీవ రెడ్డిగారిలో ఇంకో విశేషం మరొక విశేషం ఏమిటంటే ఆయన స్వజనసంకల్పం. ప్రజాక్షేమం దృష్ట్యా ఫలానా పని జరగటం వారి నీయమని ఆయన మనస్ఫూర్తిగా విశ్వసించిన పక్షంలో హరిబ్రహ్మాదులు అడ్డం వచ్చినా సరే ఆ పని జరిగి తీరవలసిందే. అన్నిటికంటే గొప్ప విశేషమేమిటంటే ఎంతటి జటిల సమస్య విషయంలో నైనా స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా, తాత్సారం చెయ్యకుండా నిర్ణయాలు తీసుకొనటం, వాటిని వెంటనే దృఢంగా అమలు పరచటం. ఈ శక్తి ఉండబట్టే, శ్రీ సంజీవ రెడ్డి సివిల్ శాఖల కార్యదర్శుల చేతుల్లో కీలుబొమ్మ కాకుండా, వారికి సింహస్వప్నంగా ఉంటూ వచ్చారు. ఇంత గట్టి పిండాన్ని తామెన్నటూ ఎరగమని ఉన్నత ప్రభుత్వోద్యోగులు కొందరు లోపాయికారీగా ఒప్పుకుంటున్నారు. ఆయన వెళిపోతున్నా సంతో రహస్యంగా సంతోషించే వారు కూడా లేకపోలేదు. ఆయన పరిపాలనా విధానం ఎంత పటిష్ఠంగా ఉన్నదో అంత స్వచ్ఛంగా సాగింది. అందుకే అది ప్రజారంజకమైనది.

* * *

ప్రకాశంగారి లడగాలలో కొన్నిటిని అలవరచుకొనటమే కాకుండా, శ్రీ సంజీవ రెడ్డి ఒక విషయంలో ఆయన కంటె నాలుగాకులు ఎక్కువ చదివాడని పించుకొన్నారు. ప్రకాశంగారికి వ్యవహార దక్షత లేదు. శ్రీ సంజీవ రెడ్డి మంచి వ్యవహారదక్షుడు. ఎవరిని ఏ విధంగా వశపరచుకోవాలో ఆయనకు బాగా తెలుసు. అందరిని తన వైపుకు లాక్కొనే విద్య ఆయనకు కరతలా మలకం. నీతి నియమాలను అతిక్రమించకుండా దీనిని సాధించటం ఆయన ప్రత్యేకత. వశీకరణ మంత్రంతో పాటు అందర్నీ వారి వారి హద్దుల్లో ఉంచే చాకచక్యం కూడా వారికి ఉన్నది. మొండికెత్తిన ఘటాలను ఎలా గెంటి వేయాలో కూడా ఆయనకు బాగా తెలుసు. రాష్ట్ర కాంగ్రెస్ సంఘాలలో పదవులకై కీచులాడుకొనే జనానికి వచ్చే రెండేళ్ళు గడ్డు కాలమని చెప్పక తప్పదు.

* * *

సోషలిస్టు దేశం ఎన్నడూ మరొక దేశంపై దురాక్రమణ జరపదని, నైనాసోషలిస్టు దేశం కనుక, సదరు దేశం మన దేశంపై దురాక్రమణ జరపటం అన్న ప్రశ్నే లేదని ఇటీవల భారత కమ్యూనిస్టు నాయకుడు శ్రీ భూపేష్‌గుప్త అన్నారు. కమ్యూనిస్టులకు మూఢనమ్మకాలంటే కిట్టదని నిన్న మొన్నటి వరకు అనుకునే వాడిని. కాని ఇప్పుడు ఈ అభిప్రాయాన్ని మార్చుకోవలసి వస్తున్నది. యుగయుగాలుగా మానవులు ఇట్టి మూఢ నమ్మకాలలో పడి కొట్టుకొంటూనే ఉన్నారు. పురాణ యుగంలో ఋషులంతా జితేంద్రియులని నమ్మేవారు. కాని మేనక వచ్చి నృత్యప్రారంభించేసరికి విశ్వామిత్రుని తపోనిష్ఠ అంతా క్షణంలో కరిగిపోయింది. కళ్ళుతిరిగి పడ్డాడు. ఆఖరికి పుట్టిన బిడ్డను అడవిలో వదిలేసి వెళ్ళిపోయాడు. అటువంటి మహా ఋషులే ఇంద్రియ చాపల్యానికి అపరుతి ఐనప్పుడు, కరడు గట్టిన భౌతిక వాదులని పేరెన్నికగన్న చౌ ఎన్-లై ప్రభృతుల సంగతి వేరే చెప్పాలా?

—కూచిమంచి.

గ్రామీణ ఉన్నత విద్యామండలి జాతీయ స్థాయిసంఘం ఆరవ సమావేశం గత నెల 27 వ తేదీనాడు న్యూఢిల్లీలో జరిగినప్పుడు గ్రామీణ విద్యావిషయంలో ఇంతవరకు సాధించిన అభివృద్ధిని సమీక్షించి భవిష్యత్ కార్యక్రమాన్ని చర్చించటం జరిగింది. పై చిత్రంలో కేంద్ర విద్యామంత్రి డాక్టర్ కె. ఎల్. శ్రీమాలి అధ్యక్షోపన్యాసం చేస్తున్న దృశ్యం.

సంపాదకీయ లేఖలు

మంచిర్యాల సిమెంట్ ఫ్యాక్టరీలో అశాంతి

ఆర్యా! మంచిర్యాల సిమెంట్ ఫ్యాక్టరీ మేనేజ్‌మెంట్ వారి కార్మిక వ్యతిరేక చర్యలు దినదినము అధికమైపోతున్నాయి. చీటికి మాటికి కార్మికులను సస్పెండ్ చేయడం, చార్జిషీట్లు యివ్వడం, డిస్‌మిస్‌లు చేయటం జరుగుతున్నది. ఇటీవల 9 మంది కార్మిక నాయకులను పనుల నుండి తొలగించిన వివాదము లేబర్ ట్రిబ్యునల్ విచారణలో వుండగా, మేనేజిమెంట్ వారు మళ్ళీ శ్రీ హమ్మద్ హుస్సేన్ అనే పర్మనెంట్ వర్కర్‌ను విచారణ జరపకుండా డిస్‌మిస్ చేశారు. బుచ్చయ్య అనే వానిని సస్పెండ్ చేశారు.

స్థానికముగా మేస్త్రీలు సిద్ధంగా వున్నా, మేనేజిమెంటువారు, పహాబాద్ (మైసూర్) నుంచి రావిస్తున్నారు రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్ మున్నగు ప్రాంతాలనుండి దాదాపు 25 మంది వాచ్‌మెన్‌లను ఉద్యోగంలోచేర్చి స్థానిక కార్మికులపై గుండా చర్యలు జరిపిస్తున్నారు. బహుశా టి. కె. ఫిస్టిన్ ఖన్నా అనే ఒక ఆఫీసర్ కూడా బొంబాయి నుండి వచ్చినట్లున్నది వెల్‌ఫేర్ కమిటీ అనే పేరుతో పోటీ సంఘము పెట్టాలని ప్రయత్నాలు కూడా చేసి విఫలమైనారు. ఫ్యాక్టరీలో వల్ల కార్మికులలో చాలఅలజడి బయలుదేరి, ఉద్రిక్త పరిస్థితి ఏర్పడే అవకాశాలున్నవి. కాబట్టి ప్రభుత్వం వెంటనే జోక్యంచేసుకొని పరిస్థితి చక్కదిద్దవలసిందిగా కోరుతున్నాను.

మంచిర్యాల, ఆరూరి రఘురాములు.

పోస్టల్ అసౌకర్యాలు

ఆర్యా! అమలాపురం సబ్ పోస్టాఫీసులో సబ్ పోస్టుమాస్టర్ గా పనిచేస్తున్న శ్రీ పి. సుబ్బారెడ్డి గత సెప్టెంబర్ 24వ తేదీ నుంచి కొత్తగా స్థాపించబడిన నందిపేట పోస్టాఫీసుకు బదిలీ చేయబడినవి. దాని వలన మూత పడకుండా పల్లి, గాడీపల్లి మధ్యలోగల ప్రాంతి అసౌకర్యం కలుగుతున్నది. అమలాపురం సబ్ ఆఫీసులో నుండి వస్తున్న పత్రికలు, వార పత్రికలు, పార్సెలు సమయానికి కందుచుండెడివి. ఇప్పుడు దిన పత్రికలు వారమునకు ఒకే ఒకసారి బట్వాడా అవుతున్నాయి. వార పత్రికలు వారాంతానికి కూడా అందుట లేదు. పోస్టు ఉదయం ఎనిమిది ఘంటలకు వెళ్ళి రెండవ రోజు ఉదయం 8 గంటలకు వస్తుంది ఈ అసౌకర్యముల వలన ప్రజలకు చాలా యిబ్బంది కలుగుతున్నది.

నిజామాబాద్ నుండి గాంధీపల్లి వరకు రోడ్డు లేదు. అందు పై ఆర్. టి. సి. బస్సులు అర్మూరు, బాల్కొండ ద్వారా గాంధీపల్లి వరకు నడచును కావున తపాలా శాఖవారు దయచేసి ఈ అసౌకర్యము బాపుటకు అర్మూరు లేదా బాల్కొండ సబ్ పోస్టాఫీసులకుపై ప్రాంచాఫీసులను తీసివేసి, ఆర్. టి. సి. బస్సుల ద్వారా పోస్టు పంపించే సదుపాయము చేయటం మంచిదని మనవి.

నూతపల్లి, పి. [illegible] రెడ్డి, పంచాయతీ అధ్యక్షులు.

బాన్, డిసెంబర్ 4

ఇండియా తృతీయ పంచవర్ష ప్రణాళికలు పశ్చిమ జర్మనీ ఆర్థిక సహాయం కలదుచేయనున్నట్లు పశ్చిమ జర్మనీ పార్లమెంటులో విదేశాంగ మంత్రిత్వంలోని సెక్రటరీ ఆఫ్ స్టేట్ హెర్బర్ట్ బెర్గ్ తెలిపెను.

భూకమతాల గరిష్ఠ ప్రమాణం బిల్లు

వచ్చే సంవత్సరం ప్రవేశపెట్టనున్నట్లు రెవిన్యూమంత్రి వెల్లడి

హైద్రాబాద్, డిసెంబర్ 5

భూకమతాల గరిష్ఠ ప్రమాణాల బిల్లు పరిశీలనకై నియమింపబడినఉభయ సభల జాయింట్ సెలెక్ట్ కమిటీ సమావేశం గురువారం నాడు జరిగింది. సెలెక్టుకమిటీ పరిశీలన ఇంకాపూర్తి కాలేదనీ, కమిటీ సభ్యులు నిజామాబాద్, బోధన్ కూడా వెళ్ళి వచ్చిన తర్వాత కమిటీ ఆఖరు సమావేశం జనవరిలో జరుగుతుందనీ సెలెక్టు కమిటీ అధ్యక్షులు శ్రీ కొండా వెంకట రంగారెడ్డి గారు నేడు ఇక్కడ అన్నారు. ఆదాయంపైగాక, భూకమతాలకు గరిష్ఠ ప్రమాణ నిర్ణయం జరగాలనే వాదనకు కమిటీ సభ్యులు కొందరు సుముఖంగా వున్నట్లు కూడా వారు వెల్లడించారు. వచ్చే సంవత్సరంలో భూసంస్కరణల బిల్లు ప్రవేశ పెట్టడం జరుగుతుందని కూడా వారు తెలిపారు.

కుటుంబానికి గరిష్ఠ భూవసతి

30 ఎకరాలని రాజస్థాన్ శాసనం

జైపూర్, డిసెంబర్ 4

రాజస్థాన్‌లో ఐదుగురు, అంతకు ఎక్కువ మంది సభ్యులు గల కుటుంబాలకి ఉండదగిన భూమికి గరిష్ఠ ప్రమాణం 30 యకరాలుగా నిర్ణయించారు. కుటుంబంలో ఐదుగురి కంటే ఎక్కువ మంది సభ్యులు ఉంటే, అదనంగా ఎంత మంది కుటుంబంలో ఉంటారో వారందరికి తలా ఐదేసి యకరాల భూమి చొప్పున అదనపు భూమి ఉంచుకోవచ్చును. కాని ఎంత పెద్ద కుటుంబం అయినా, ఒక కుటుంబ భూవసతి ఏ పరిస్థితులలోను 60 యకరాలకు మించి ఉండరాదు అనే మరో క్లాజు ఉన్నది

ఒక 'స్టాండర్డు యకరము' అంటే ఏటా పది మణుగుల గోధుమ పండే భూమి అనీ, గోధుమ పండని భూములైతే పది మణుగుల గోధుమ పంట విలువకు అర్థికంగా సమానమైన యితర పంటలు పండే భూమి అని బిల్లులో నిర్వచించారు.

పై క్లాజుతో సహా భూవసతుల గరిష్ఠ ప్రమాణాల బిల్లును రాజస్థాన్ శాసన సభ నేడు ఆమోదించింది.

నిర్బంధంగా పొదుపు

శ్రీ మొరార్జీ ఖండన

న్యూఢిల్లీ, డిసెంబర్ 4

ప్రతివారు పొదుపు చెయ్యడం నిర్బంధం చేసే ప్రతిపాదన ఏదీ ప్రభుత్వ పరిశీలనలో లేదని ఆర్థిక మంత్రి శ్రీ మొరార్జీదేశాయ్ నేడు లోక్‌సభలో అన్నారు. అయితే వీలయినంత ఎక్కువ పొదుపు మొత్తాలను సేకరించాలన్న దృష్ట్యా ఈ ప్రతిపాదనకు గల అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తుందని ఆయన వెల్లడించారు.

జమురియా ప్రేలుడు ప్రమాద కారణం

విచారణాధికారి నియామకం

న్యూఢిల్లీ, డిసెంబర్ 4

గత ఆదివారం అసన్సాల్ ప్రాంతంలోని జమురియా ప్రాంతంలో జరిగిన ప్రేలుడు ప్రమాద కారణాలను విచారించడానికి బర్ద్వాన్ డివిజన్ కమీషనర్ శ్రీ వి. యస్. ఆర్. సూరిటను నియమించినట్లు లోక్ సభలో వర్క్స్ మంత్రి శ్రీ కె.సి. రెడ్డి నేడు వెల్లడించారు. ఈ విచారణలో అసెసర్‌గా ప్రేలుడు పదార్థాల డిప్యూటీ చీఫ్ ఇనస్పెక్టర్ శ్రీ యు. కె. లాహిరి ఉంటారని కూడా ఆయన అన్నారు. ఈ విచారణను వీలైనంత త్వరలో పూర్తి చేయమని ఆదేశించినట్లుగా కూడా ఆయన వివరించారు.

తర్వాత కార్యవర్గంలోని ఖాళీలకు

ప్రభుత్వ కార్యకలాపాలకు ప్రజా సహకారమే వెన్నెముక

కర్నూల్ జిల్లా పరిషత్తును ప్రారంభిస్తూ ముఖ్య మంత్రి ఉద్బోధ

కర్నూల్, డిసెంబర్ 4

ప్రభుత్వ కార్యకలాపముల విజయానికి ప్రజా సహకారమే వెన్నెముకయని, కాగా ప్రజలంతా పరస్పర సహకారంతో పంచాయతీ వ్యవస్థను జయప్రదం చేయాలని కర్నూల్ జిల్లా పరిషత్తును ప్రారంభిస్తూ ముఖ్య మంత్రి శ్రీ సంజీవరెడ్డిగారు విజ్ఞప్తి చేశారు.

అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షులుగ ఎన్నికైన శ్రీ సంజీవ రెడ్డి గారికి ప్రజలు ఘనమైన స్వాగతం యిచ్చారు. పూలమాలలతో ఆయన్ను ముంచివేసి, పూలతో అలంకరింపబడిన జీపులో ముఖ్య వీధులగుండా ఊరేగింపులో శ్రీ సంజీవరెడ్డిని జిల్లా పరిషత్తు ప్రారంభోత్సవ సభాస్థలికి తీసుకవెళ్ళారు. కాంగ్రెస్ వయస్సునుగుర్తుకు తెస్తూ 74 జతల కాడియెడ్లు ఉత్సవ అగ్రగాములుగ ముందు నడువగా ఊరేగింపు నడిచింది.

జిల్లా పరిషత్తుకు ప్రారంభోత్సవం చేస్తూ, ఇరిగేషన్, విద్య, ప్రజారోగ్యం ఆదిగాగల వివిధ రంగాలలో గతకొలది సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్ సాధించిన ఘనవిజయాలను వివరించిన మీదట ఈ ప్రభుత్వ కార్యకలాపము లన్నింటికి ప్రజలే వెన్నెముక యనీ, అందు వల్లనే ప్రజాభ్యుదయ కార్యక్రమాలన్నీ ప్రజల పరం చేయబడుతున్నాయనీ, ప్రజలు యీ కార్యక్రమాలను జయప్రదంగా నిర్వహించి, పేరు నిలబెట్టవలాలనీ, అపుడు ఇంకా ఇతోధిక అధికార బాధ్యతలు ప్రజలకు వప్పగించబడునని అన్నారు.

ఆంధ్ర ప్రదేశ్ సుస్థిర పురోగామి పథమున ముందంజ వేస్తున్నదన్నారు కాంగ్రెస్ అధ్యక్షులుగా తాము ఎన్నికైనందున త్వరలో ముఖ్య మంత్రి పదవిని వదలనున్నామనీ, నూతన ముఖ్యమంత్రికి కూడా ప్రజా సహకారం లభించ గలదని శ్రీయుతులు సంజీవరెడ్డిగారన్నారు.

పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్తు ప్రారంభం

ఏలూరు, డిసెంబర్ 4

పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్తుకు గత మంగళవారం నాడు రాష్ట్ర న్యాయ మంత్రి శ్రీ గ్రంథి వెంకటరెడ్డి నాయుడు ప్రారంభోత్సవం చేశారు. జిల్లా కలెక్టర్ ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. పరిషత్తు అధ్యక్షుడు శ్రీ అల్లూరి బాపినీడు పరిషత్తులో అధికార, అనధికార సభ్యుల బాధ్యతల గురించి ప్రసంగించారు.

సాంఘిక విద్యా దినోత్సవం

నల్గొండ, డిసెంబర్ 2

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శ్రీ జి.యస్. రెడ్డి అధ్యక్షతన సాంఘిక విద్యాదినోత్సవం జరిగింది. సభకు ముందు పురవీధుల గుండా ఊరేగింపు జరిగింది. నిరక్షరాస్యతా నివారణ కృషిని గురించి డి.ఇ.ఓ. రామదాస్ గారు, లైబ్రరీ ఉద్యమం గురించి జిల్లా పరిషత్తు ఉపాధ్యక్షులు శ్రీ టి.వి. పిలారామారావుగారలు మాట్లాడారు. పశునాలయాలు, గ్రంథాలయాలు, వయోజన విద్యాలయాలు ప్రతిగ్రామంలోను నెలకొల్పి, నిరక్షరాస్యతా నిర్మూలనకు, విజ్ఞాన ప్రచారానికి కృషి చేయాలని శ్రీ జి.యస్. రెడ్డిగారు ఉద్బోధించారు.

డి. రాజయ్య, పి.వి. రంగారావు గారలు కూడా సభలో ప్రసంగించారు.

బడి పిల్లలకు బట్టల పంపకం

కామారెడ్డి, డిసెంబర్ 4

కామారెడ్డిలో గతసోమవారంనాడు హరిజన పాఠశాల వార్షికోత్సవం జయప్రదంగా జరిగినది. సోషల్ సర్వీస్ శాఖ వారు బడిపిల్లలకు బట్టలు బహూకరించినారు శాసన సభ్యురాలు శ్రీమతి టి యన్. సదాలక్ష్మి యీ బట్టలను 35 మంది బాలికా, బాలురకు పంచిపెట్టారు. సభలో స్థానిక కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ గోపాలరావు, కార్యదర్శి శ్రీ రామచంద్రయ్యగారలు కూడా మాట్లాడారు.

స్టేషన్ మాష్టర్‌కు వీడ్కోలు

ఘట్‌కేశ్వర్, డిసెంబర్ 2

ఇక్కడ నుంచి మల్కాజ్‌గిరి బదిలీయై వెళ్తున్న రైల్వే స్టేషన్ మాష్టర్ శ్రీ హనుమంతరావు గారికి సానిక పుర ప్రముఖులు, సాంఘిక కార్యకర్తలు వీడ్కోలు యిచ్చారు. ఈ సందర్భంలో జరిగిన సభలో పలువురు ప్రసంగించారు. శ్రీ హనుమంతరావు గారి సాంఘిక సేవా తత్పరతకు చిహ్నంగా వెండి పళ్ళెము, గ్లాసు గ్రామస్థుల తరపున బహూకరించారు.

శ్రీయుతులు మల్లారెడ్డి, వాసుదేవ్ మూర్తి, గందెపాపయ్య, కె. మల్లయ్య గారలు సభ్యులుగా ఎన్నుకున్నారు

స్వల్ప సర్దుబాట్లకు ఇండియా సుముఖత

శ్రీ మీనన్ ప్రకటన

న్యూఢిల్లీ, డిసెంబర్ 4

సరిహద్దు తగాయిదాల ప

ఆత్మకూరు పంచాయతీ సమితి ప్రారంభోత్సవం

మహబూబ్‌నగర్, డిసెంబర్ 4

స్వయంకృషి, స్వయం సహాయం ద్వారా పంచాయతీ సమితులు, గ్రామ పంచాయతీలు కలసి, గ్రామీణ ప్రజలకు ఇతోధిక సౌకర్యాలు కల్గించడానికి కృషి చేయాలని ఆత్మకూరు పంచాయతీ సమితిని ప్రారంభిస్తూ, మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్తు అధ్యక్షులు శ్రీ కె. రామచంద్రారెడ్డి గారన్నారు.

పంచవర్ష ప్రణాళికలు ప్రభుత్వ ప్రణాళికలు కావు. అవి ప్రజాప్రణాళికలేనని, వాటి నిర్వహణకి ప్రజలకు సంపూర్ణంగా సహకరించాలనీ అన్నారు.

జిల్లా పరిషత్తు ఉపాధ్యక్షులు శ్రీ కె. కె. రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కె. సిద్ధలింగప్ప, హారిత్ ఖాన్ ప్రభృతులు కూడా సభలో ప్రసంగించారు.

కొల్లాపురం

మహబూబ్‌నగర్, డిసెంబర్ 4

అపోహలూ, మూఢనమ్మకాలు, దారిద్ర్యం, అజ్ఞానము, అవిద్యా అనే త్రివిధ శత్రువులను తుదముట్టించడమే లక్ష్యంగా పంచాయతీ సమితులు కృషి చేయాలని కొల్లాపూరు పంచాయతీ సమితిని ప్రారంభిస్తూ రెవిన్యూ మంత్రి శ్రీ కె. వి. రంగారెడ్డిగారన్నారు. సమితి వ్యవహారాలలోకి రాజకీయాలు రాకుండా, అధికారదుర్వినియోగం జరుగకుండా గ్రామాభ్యుదయం సాధించాలని వారు ఉద్బోధించారు.

సభలో శాసన పరిషత్తు సభ్యులు కె. సుబ్రహ్మణ్యం నాయుడు, తాలూకా కాంగ్రెస్ అధ్యక్షులు కె. రంగదాస్, వి. శేషగిరిరావు, గోపాలరావుగారలు కూడా ఉపన్యసించారు.

మొదట్లో మంత్రిగారికి సమితి అధ్యక్షులు శ్రీ కృష్ణారెడ్డి స్వాగతం చెప్పారు.

రాజస్థాన్ ప్రదేశ్ కాంగ్రెస్

జైపూర్, డిసెంబర్ 4

రాజస్థాన్ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడుగా శ్రీ మథుర్ జాస్ మథూర్ నేడు ఎన్నుకొనబడ్డారు. శ్రీ మాథూర్ పార్లమెంట్ సభ్యుడు.

శ్రీ రేవతీ విద్యా నికేతన్

చిక్కడపల్లి, హైద్రాబాద్

హెచ్. ఎస్. సి., ఆంధ్ర మెట్రిక్, ఎస్.ఎస్.ఎల్.సి., పి. యు. సి. (1960 మార్చి) లకు

* సమర్థవంతమైన కోచింగ్
* ప్రత్యేక పర్యవేక్షణ
* పరిమితమైన ఎడ్మిషన్లు

ఢిల్లీలో గురజాడ జయంతి

న్యూఢిల్లీ, డిసెంబర్ 4

